# రాజు మరియు ఆయన రాయబారులు

### మత్తయి 10, పరిశీలన

మత్తయి రచనలోని చర్చనీయాంశం: రాజు, ఆయన రాజ్యం.[1] మన పఠనములో యింతవరకు, రాజుయొక్క లక్షణములను లేక యోగ్యతలను నొక్కి చెప్పి – నెరవేర్చబడిన ప్రవచనాన్ని, అద్భుతకార్యాలకు సూచించాడు.

ఏదియెలాగున్నా, మత్తయి 9 చివరిలో, రాజైన యేసుకు ఒక అవసరం వచ్చింది. ఆయన, "వారి సమాజమందిరములలో బోధించుచు రాజ్యసువార్త ప్రకటించుచు, ప్రతి విధమైన రోగమును ప్రతి విధమైన వ్యాధిని స్వస్థపరచుచు, సమస్త పట్టణములయందును గ్రామములయందును సంచారము చేసెను." (9:35). ఆయన హృదయము మనుష్యుల యెడల జాలితో నింపబడింది. కోత ఎంత విస్తారంగా ఉన్నా (9:36), పనివారు కొద్దిమందే అయ్యారు (9:37). ఆ పనియంతటిని క్రీస్తు ఒక్కడే చేయలేక పోయారు. ఆయనకు సహాయం కావలసివచ్చింది. సందేశాన్ని వ్యాపింప చేయడానికి, ఆయన పన్నెండు మంది ప్రత్యేకమైన రాయబారులను ఏర్పరచుకొన్నారు (10:2–4).[2]

మత్తయి 10, (ఆ పన్నిద్దరిని)లో అపొస్తలులను గలిలయలోనికి ప్రకటించడానికి ఆయన పంపిన వృత్తాంతం ఉంది. ప్రభువు వారికిచ్చిన ఆజ్ఞలన్నీ అందులో ఉన్నాయి (మత్తయి 10:5; 11:1లను చూడు). వాటిలో ఎక్కువ భాగం ప్రత్యేకించి ఆ పర్యాటనకు సంబంధించినదే. ఆ పన్నిద్దరు కేవలం యూదుల మధ్యకే పోవలసియుంది, అన్యజనుల వద్దకుగాని, సమరయ్యుల పట్టణంలోనికిగాని వారు ప్రవేశింపలేరు (10:5, 6).

దగ్గరకు వచ్చి లేక సమీపించి చూస్తుండగా, ప్రభువు వారిని తరువాత కాలానికి కూడా సిద్ధపరచుతున్నట్టు మనకు తెలుస్తుంది. అంటే ఆయన పరలోకమునకు తిరిగి వెళ్లిన తరువాత భూమి మీద తన ప్రతివిధులైయుండునట్లు ఆయన వారిని సిద్ధపరచారు. "నా నిమిత్తము మీరు అధిపతులయొద్దకును తేబడుదురు" అని ఆయన తెలిపారు (18 వ.). అన్యజనులను మినహాయించిన ఈ ప్రయాణంలో అది సంభవించలేదు. అయితే, అపొస్తలుల కార్యగ్రంథమందు దాఖలైన సంభవాల్లో ఈ ప్రవచనపు ప్రతిపాదన నెరవేర్చబడింది. (ఉదాహరణకు, 23నుండి 26 అధ్యాయాలను చూడు). మరో విధంగా చెప్పాలంటే, అపొస్తలులకు ప్రభువు యిచ్చిన ఆజ్ఞలు, వారనుకున్న దానికంటె అధికమైనవి.

10వ అధ్యాయంలో మనకు కూడా పాఠాలున్నాయి. ఈ అధ్యాయమంతటిని ప్రసంగంలో పూర్తిచేయలేను. అయితే, పూర్వ, ప్రస్తుత రాయబారులు అనే విషయం మీద ఆలోచనలను కలిగించగోరుచున్నాను.

## గతకాలపు రాయబారులు

పూర్వ రాయబారులతో ప్రారంభించుదాం. క్రీస్తు వద్ద ఒక సారి ఉన్న ఈ రాయబారులు[3] "అపొస్తలుల"నబడ్డారు (2 వ). "పంపబడినవారు" అని అర్థమిచ్చే గ్రీకు పదం నుండి "అపొస్తలు" అనే పదం వచ్చింది. "పంపబడిన ఎవరైనా" అనే సాధారణమైన అర్థంతో కొన్నిసార్లు ఈ పదం ఉపయోగించబడింది (2 కొరింథీ. 8:23; ఫిలిప్పీ. 2:25), కాని ఈ పన్నిద్దరు మాత్రం ప్రత్యేకమైనవారు. వారు ప్రత్యేకమైన యోగ్యత కలిగిన వారై యుండాలి. (అపొ. 1:21, 22; 1 కొరింథీ. 9:1; ఎఫెసీ. 4:11 చూడు). రాబోయే తరాలకు యిది (వారసత్వంగా) యివ్వబడేది కాదు.[4] ఈ ప్రత్యేకమైన రాయబారులు 2నుండి 4 వచనాలవరకు పొందుపరచబడినవారై యున్నారు.

> ఆ పండెండు మంది అపొస్తలుల పేళ్లు ఏవనగా, మొదట పేతురనబడిన సీమోను, అతని సహోదరుడైన అంద్రెయ; జెబెదయ కుమారుడగు యాకోబు, అతని సహోదరుడగు యోహాను; ఫిలిప్పు, బర్తలొమయి; తోమా, సుంకరియైన మత్తయి; అల్ఫయి కుమారుడగు యాకోబు, తద్దయియను మారు పేరుగల లెబ్బయి; కనానీయుడైన సీమోను ఆయనను అప్పగించిన ఇస్కరియోతు యూదా.

మనం ఈ జాబితాను చదువుతుండగా రెండు వాస్తవాలు మనకు తట్టుతాయి: (1) లోకం యొక్క దృష్టిలో చూస్తే వీరు బహు సామాన్యమైన మనుష్యులు. వారికి ఉన్నతమైన సాంఘీక స్థితిగాని, ప్రత్యేకమైన తర్ఫీదుగాని, విశేషమైన ఏ తలాంతుగాని ఉన్నట్టు లేదు. సాధారణమైన ఈ మనుష్యులు బహు అసాధారణమైన పనికి పిలువబడ్డారు. ప్రభువు ఎవరినైనా ఉపయోగించుకొనగలరు. (2) ఏ దృష్టితో చూచినా, అది వింతైన కలయిక. ఉదాహరణకు, రోమీయులకు పన్ను వసూలుచేసి పెట్టే మత్తయి ఉన్నాడు; అతడు జొలెతేవాడైన సీమోను ప్రక్కన పని చేస్తున్నాడు. జొలెతే వారు మత పిచ్చిగల ఉగ్రవాదులు.[5] వారు ప్రభువైన యేసును కలిసికొనకముందు మత్తయి వైపు ఈ సీమోను కత్తి దూసియుండే వాడే – ప్రజలందరు సమాధానంగా ఉండేలా ప్రభువు సహాయం చేయగలరు.

వీరు ప్రత్యేకమైన రాయబారులైయున్నందున, మత్తయి 10లోనిదంతా మనకు వర్తిస్తుందని ఎదురుచూడకూడదు. ఈ మనుష్యులను గూర్చియు వారి పనిని గూర్చియు 10వ అధ్యాయము కొన్ని ప్రత్యేకమైన విషయాలను తెలుపుతోంది.

### వారి ప్రత్యేకమైన అర్హతలు (1, 8 వచనాలు)

అపొస్తలులకు ప్రత్యేకమైన అర్హతలు యివ్వబడ్డాయి (అపొ. 2:43; 2 కొరింథీ. 12:12; హెబ్రీ. 2:1–4). దయ్యములు వెళ్లగొట్టడానికి, రోగులను బాగుచేయడానికి, మృతులను లేపడానికి వారికి శక్తి అనుగ్రహింపబడింది (మత్తయి 10: 1, 8).

### వారి ప్రత్యేకమైన పని (5–7 వచనాలు)

అపొస్తలులకు ప్రత్యేకమైన పని నియమింపబడింది – దాన్ని మనం లిమిటెడ్

కమీషన్ అని పిలుస్తాం. దాని పరిమాణం పరిమితి చేయబడినదైయుంది: మనం ముందుగా గమనించినట్టే, వారు యూదుల యొద్దకు మాత్రమే పంపబడ్డారు – సమరయ్యుల యొద్దకు గాని, అన్యజనులయొద్దకు గాని పోకుండునట్టు వారు ఆదేశింపబడ్డారు (5, 6 వచనాలు). అందులో వారి సందేశం కూడా పరిమితి చేయబడింది: "పరలోక రాజ్యము సమీపించిన"దని వారు ప్రకటించాలి. (7 వ.). రానున్న రాజ్యం కొరకు సిద్ధపడడానికి గాను మారుమనస్సు పొందుడని వారు బోధించాలి (మార్కు 6:12; మత్తయి 3:2; 4:17లను చూడు).

మన పని భిన్నమైనది; దాన్ని మనం గ్రెట్ కమీషన్ అని పిలుస్తాం. (మత్తయి 28:18–20; మార్కు 16:15, 16). పరిమాణంలో దీనికి పరిమితి లేదు. మనం సర్వలోకానికి వెళ్లాలి (మత్తయి 28:19; మార్కు 16:15). సందేశంలో కూడా గ్రెట్ కమీషన్ పరిమితి లేనిదైయుంది: మనుష్యులందరికి సువార్తను దాని సంపూర్ణ రూపంలో ప్రకటించాలి. రాజైన క్రీస్తు వచ్చారన్న సమాచారాన్ని మనం ప్రతి ఒక్కరికి చాటించాలి. సంఘ/ రాజ్యం స్థాపించబడిందనీ, దానిలోనికి ఎవరైనా రావచ్చునని ప్రకటించాలి!

**వారి ప్రత్యేకమైన ఆదేశాలు (9–16 వచనాలు)**

అపొస్తలులకు ప్రత్యేకమైన ఆదేశాలు యివ్వబడ్డాయి. వారు తేలికగా ప్రయాణం చేయాలి (మత్తయి 10:9, 10); తాము చేరిన వారి యిండ్లలో నివసించాలి (11–13 వచనాలు). వారు చేరకపోతే తమ సమయాన్ని వారు వ్యర్థం చేసికోపనిలేదు; వారిని వదలి వెళ్లి పోవాలి (13బి–15). వారి ఉపదేశంలో జ్ఞానాన్ని వారు ఉపయోగించాలి (16బి వ.).

ఈ ఆదేశాలు ప్రత్యేకంగా వారికే యివ్వబడ్డాయి, అయితే నీకు నాకు ఆలాటి పాఠాలు అవసరం. మన అవసరాలు తీర్చబడునట్టు మనం ప్రభువు మీద ఆధారపడ నేర్చుకోవాలి. ప్రభువు పని విషయంలో చేసే నిర్ణయాలకు మనకు జ్ఞానము, వివేచన అవసరమైయుంది.

**వారి ప్రత్యేకమైన ప్రోత్సాహము (19, 20, 40–42)**

చివరకు అపొస్తలులకు ప్రత్యేకమైన ప్రోత్సాహం దొరికింది. వారు నిర్బంధింప బడినప్పుడు, వారు ఏమి చెప్పాలో పరిశుద్ధాత్మ వారికి తెలియజేస్తాడు (19, 20 వచనాలు). బర్టన్ కఫ్‌మన్ యిలా అన్నారు: "అపొస్తలులను సర్వసత్యములోనికి నడిపించినట్టు – యిది క్రొత్త నిబంధనలో బహు బలమైన ప్రతిపాదనయైయున్నది."[6] దీనికి భిన్నంగా, మనలను ప్రశ్నించు ప్రతివానికి జవాబు చెప్పడానికి గాను మనం చదువవలసియుంది (1 పేతురు 3:15; KJV).

వారు క్రీస్తు ఇచ్చిన అభయం వలన బలపడ్డారు. క్రీస్తు యొక్క ప్రత్యేకమైన రాయబారులుగా వారు ప్రాతినిధ్యం పొందారు. వారిని అంగీకరించినవారు ఆయనను అంగీకరించినట్టు వారు చెప్పబడ్డారు (40–42 వచనాలు).[7] రాజుకు లేక ఒక దేశపు ప్రసిడెంటుకు ప్రతినిధిగా పంపడం అన్నది గొప్ప గౌరవమైయుంది. "రాజులకు రాజును

ప్రభువులకు ప్రభువునైన" వానిచే పంపబడడమనేది మహాగొప్ప గౌరవమైయున్నది (ప్రకటన 19:16)!

అపొస్తలులు యేసు యొక్క ప్రత్యేకమైన రాయబారులైయున్నారు. వారికి యివ్వబడిన ప్రత్యేకమైన ఆదేశాలు (వారు ఏమి చెప్పాలో ఆలోచించుకోవలసిన అవసరం వారికి లేదు). మనకు సంబంధించవు.

## ప్రస్తుత రాయబారులు

ఈ అధ్యాయంలో మన కొరకు కూడా పాఠాలున్నాయి – ప్రస్తుతమున్న రాయబారులను చూద్దాం. ప్రభువు నిత్య రాయబారులు. ప్రత్యేక రాయబారులం కాము. అయితే నేడు మనం ప్రభువునకు ప్రాతినిధ్యమిస్తాం. పౌలు కొరింథీయులకు యిలా వ్రాశాడు:

> కాగా ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి; పాతవి గతించెను, ఇదిగో క్రొత్తవాయెను; సమస్తమును దేవుని వలననైనవి; ఆయన మనలను క్రీస్తు ద్వారా తనతో సమాధాన పరచుకొని, ఆ సమాధానపరచు పరిచర్యను మాకు అనుగ్రహించెను. అదేమనగా, దేవుడు వారి అపరాధములను వారిమీద మోపక, క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొనుచు, ఆ సమాధాన వాక్యమును మాకు అప్పగించెను.
>
> కావున దేవుడు మా ద్వారా వేడుకొనినట్టు మేము క్రీస్తుకు రాయబారులమై దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షమున మిమ్మును బలిమాలుకొనుచున్నాము (2 కొరింథీ. 5:17–20).

పౌలు మాటలు ప్రాథమికంగా తన సొంత పరిచర్యకు సంబంధించినవిగా ఉన్నాయి. కాని సంఘము కూడా అలాటి పరిచర్య కలిగియున్నదిగా అవి సూచిస్తున్నాయి – అంటే, క్రైస్తవులు జనులను దేవునితో సమాధానపరిచే బాధ్యతగలవారైయున్నట్టును, మనము అలా జరిగించినప్పుడు, మనం క్రీస్తు పక్షమున మాట్లాడువారమైయుంటాం.

నమ్మకమైన క్రైస్తవులు నేడు క్రీస్తు ప్రభువుకు ప్రతినిధులైయుంటారని అనేక లేఖనాలు బోధిస్తున్నాయి. క్రీస్తును, నమ్మకమైన ఆయన శిష్యులను వేరుచేయడం అసాధ్యమని క్రొత్త నిబంధన బోధిస్తుంది. ప్రభువు శిష్యులలో ఒకనికి ఇస్తే, ఒక గ్లాసు చన్నీళ్ళను ఇచ్చినా, అది ఆయనకే సేవచేసినట్టు భావించబడుతుంది (మత్తయి 10:42; 25:35, 40). సంఘ సభ్యులను పౌలు హింసించినప్పుడు (అపొ. 8:3), అతడు వాస్తవంగా క్రీస్తును హింసించినట్టు చెప్పబడింది (అపొ. 9:4).

సంఘమను శరీరంలోనికి మనం బాప్తిస్మంపొందాం (1 కొరింథీ. 12:13), అది ఆయన సంపూర్ణతగా చెప్పబడింది (ఎఫెసీ. 1:22, 23). మనం బాప్తిస్మం పొందినప్పుడు, మనం క్రీస్తును ధరించుకున్న వారమైయుంటాం. (గలతీ. 3:27 చూడు). మనము క్రీస్తునందు ఆయన మనయందు (రోమా 8:1; కొలస్సీ. 1:27) నిలిచియున్నాం. "ఇకను జీవించువాడను నేను కాదు క్రీస్తే మనయందు జీవించుచున్నాడు" (గలతీ. 2:20) అని మనలో ప్రతి ఒక్కరు చెప్పగలం.

విలియం, బార్క్లే యిలా వ్రాశాడు: "క్రైస్తవుడు మనుష్యులకు యేసు క్రీస్తు రాయబారియై యున్నాడు, తనలో తన యజమానుని వాక్యాన్నీ సౌందర్యాన్నీ నింపుకొని తెస్తాడు."[8] గతంలో మనం గుర్తించినట్టే, ప్రభువు యొక్క ప్రతినిధులుగా సర్వలోకానికి వెళ్లాలి, మనుష్యులందరికి ఆయన సందేశాన్ని తీసికొని వెళ్లాలి (మత్తయి 28:18-20; మార్కు 16:15, 16). దీన్ని మనస్సులో ఉంచుకొని, మన లేఖన భాగం వద్దకువచ్చి దానిలో నుండి పాఠాలు తీసికొందాం.

**జీవించవలసిన జీవితం (28, 32, 33, 37-39 వచనాలు)**

క్రీస్తు రాయబారులుగా, మనం ప్రత్యేకమైన జీవితాన్ని జీవించాలి. మనము రాజునకు ప్రాతినిధ్యం యిస్తున్నామని గుర్తించుకోవాలి!

దైవ భయముతో ఈ జీవితాన్ని తీర్చిదిద్దాలి. ప్రభువు యిలా అన్నారు: "మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడిగాని, ఆత్మను దేహమును కూడ నరకములో నశింపజేయువానికి మిక్కిలి భయపడుడి" (మత్తయి 10:28).

ప్రభువును ప్రకటించడంలో ధైర్యముగల జీవితమైయుండాలి. ఆయన యిలా అన్నారు: "మనుష్యులయెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నా తండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందును. మనుష్యులయెదుట ఎవడు నన్ను ఎరుగననునో వానిని పరలోకమందున్న నా తండ్రియెదుట నేను ఎరుగనందును" (32, 33 వచనాలు). నోటిమాటతో మనమాయనను గుర్తించాలి. "బహిరంగమైన మాటలతో గాక అనేకమంది జనులు పిరికితనపు మౌనముతో క్రీస్తును ఎరుగనందురు" అని బార్క్లే అన్నాడు.[9] మన చర్యలలో కూడా మనమాయనను గుర్తించవలసియుంటుంది. (తీతు. 1:16 చూడు). మన దేశపు ప్రసిడెంటుకు సయితము రహస్యసేవ (పరిచర్య)[10] ఉండవచ్చు గాని క్రీస్తు ప్రభువుకు అట్టిది ఉండదు. మనము మన రాజు యొక్క సేవకులమని బహిరంగంగా ఒప్పుకోవాలి!

ఇది సరియైన ప్రాధాన్యతలుగల జీవితమైయుండాలి. దేవుడు, క్రీస్తు ప్రభువు మరియు ఆయన రాజ్యము, నీతి అన్నిటికంటె ప్రధానమైనవిగా ఉండాలి. వారు వారి కార్యములు మన కుటుంబాలకంటెను ముఖ్యమైనవైయుండాలి. "తండ్రినైనను తల్లినైనను నా కంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు." (37 వ.).[11] క్రీస్తు రాజ్యము మన జీవితాలకంటె ఎక్కువ ముఖ్యమైనదై యుండాలి. మరల క్రీస్తు యిలా అన్నారు: "నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును" (39బి వ.). రోము యొక్క హింసను ఎదుర్కొన్న మొదటి శతాబ్దపు క్రైస్తవులకు ఆ వాగ్దానము ఎంత ఆదరణగా ఉండేదో!

అది తన్నుతాను ఉపేక్షించుకొను జీవితమైయుండాలి. "తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడించనివాడు నాకు పాత్రుడు కాడు" (38 వ.). మత్తయి రచనలో సిలువయొక్క ప్రస్తావన మొదటిగా యిక్కడే జరిగింది. తరువాత దినములలో అక్షరార్థంగా "క్రీస్తు తన సిలువను" ఎత్తికొన్నారు. ఆయనను వెంబడించు మనము యిష్టపడవలసియుంది – లేక యిష్టపూర్వకంగా మనం ఆయనను వెంబడించాలి.

**సహించవలసిన హింస (16-18, 21, 22, 34-36)**

క్రీస్తు "రాయబారులుగా" హింసలను ఎదురుచూడవచ్చు. "ఇదిగో తోడేళ్ల మధ్యకు గొఱ్ఱెలను పంపినట్టు నేను మిమ్మును పంపుచున్నాను" అని ప్రభువు తన శిష్యులతో చెప్పారు (16ఎ వ.). క్రీస్తు రాజులకు రాజైయుండగా, యిది వింతగానే తోస్తుంది. కాని అధికారానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన చరిత్ర రికార్డు ఉంది. వారు ఆయనను వేధించిన యెడల (26 వ.), వారి శిష్యులనెందుకు బాధించలేరు (24 వ.)?

ఈ అధ్యాయము మూడు విధములైన హింసలను ప్రస్తావించుతుంది. మొదటిది, ఆ దినములలోని నిర్వాహణతో కూడిన మతం నుండి ఏర్పడింది. "మనుష్యులను గూర్చి జాగ్రత్తపడుడి; వారు మిమ్మును మహాసభలకు అప్పగించి, తమ సమాజ మందిరములలో మిమ్మును కొరడాలతో కొట్టింతురు" (17 వ.). నిర్వహణతో కూడిన మతమువలన హింసింపబడడమెట్టిదో నేడు లోకమందు కొన్ని ప్రాంతంలో ఉన్న క్రైస్తవులకు తెలుసు. రెండవ రకపు బాధ ప్రభుత్వ అధికారులనుండి కలిగింది: "- నా నిమిత్తము మీరు అధిపతులయొద్దకును రాజులయొద్దకును తేబడుదురు." వెంటనే మనము పౌలు హింసలను గూర్చి ఆలోచిస్తూ ఉంటాం. మొదటి హతసాక్షి జ్ఞాపకం వస్తాడు. మరల, నేడు మన సహోదరులలో కొందరు యిట్టి హింసలకు గురియౌతున్నారు.[12]

మూడవ రకమైన హింస ఎదురుచూడని మూలం నుండి కలిగేది: కుటుంబం నుండి కలిగేది.[13]

> "సహోదరుడు సహోదరుని, తండ్రి కుమారుని మరణమునకు అప్పగించెదరు; పిల్లలు తలిదండ్రుల మీద లేచి వారిని చంపించెదరు (21 వ.)."

> "నేను భూమిమీదికి సమాధానమును పంపవచ్చితినని తలంచకుడి; ఖడ్గమునే గాని సమాధానమును పంపుటకు నేను రాలేదు. ఒక మనుష్యునికి వాని తండ్రికిని, కుమార్తెకును ఆమె తల్లికిని, కోడలికిని ఆమె అత్తకును విరోధము పెట్టవచ్చితిని. ఒక మనుష్యుని యింటివారే అతనికి శత్రువులగుదురు (34-36 వచనాలు)."

ప్రభువు తన శిష్యులకు తేటగా ఈ విషయాన్ని తెలియజేశారు: "మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింపబడుదురు" (22 వ.). ఆయన వారితో మోమాటములేని నిష్కపటంగా ఉన్నారు. వారి పనిని తేటగా వర్ణించి వారి ఎదుట ఉంచి - "మీకు ఉద్యోగం కావాలా? అన్నట్టు అడిగారు.

క్రొత్త నిబంధన దాన్ని గూర్చి ఎంతో మాట్లాడినప్పుడు, హింసను గూర్చి ఎందుకు కొంచెముగా మాట్లాడాలి?[14] ఆది సంఘం కూడినప్పుడు, ప్రభువు కొరకు వారు ఎదుర్కోవలసిన అపాయాలను గూర్చి మాట్లాడుకున్నారు. మనం సమయం లేకుండ ఉన్నామని మనం చాలా ఫిర్యాదు చేస్తూ ఉంటాం. చాలా అలసిపోయినట్టు బహు వేడి, బహు చలి అని అంటూ ఉంటాం. వారు హింసను సహించారు, మనమైతే అసౌకర్యాన్ని సయితం ఓర్చుకోలెం. "సిలువను క్రీస్తు ఒంటరిగానే భరించవలెనా?"

**ఎదురుచూడగల సహాయ నిధులు (26–31 వచనాలు)**

మత్తయి 10లోని క్రీస్తు మాటలు కేవలం వ్యతిరేకమైనవనే భావనతో నేను విడిచి పెట్టకోరలేదు. ఆ నాణెమునకు మరోవైపు కూడా ఉంది. క్రీస్తు "రాయబారులుగా," రాజు యొక్క శక్తి, మరియు సహాయ నిధులు మనకు ఉన్నాయి.

ఈ అధ్యాయములలో మూమ్మారు – "భయపడకుడి" అని ప్రభువు తన శిష్యులకు తెలియజేశారు: మీరు దూషింపబడినప్పుడు భయపడకుడి ఎందుకనగా, చివరిలో సత్యము జయిస్తుంది. "కాబట్టి మీరు వారికి భయపడకుడి. మరుగైనదేదియు బయలుపరచ బడకపోదు, రహస్యమైనదేదియు తెలియబడకపోదు" (26 వ.). "చెవిలో చెప్పబడినది (సువార్త) మేడలమీద ప్రకటింపబడును" (27 వ.).

మీ ప్రాణమునకు భయము కలిగినప్పుడు భయపడకుడి, ఎందుకంటె, మనుషులు చేయగలిగినదంతా వారు మీ దేహమును మాత్రమే చంపగలరు: "మరియు ఆత్మను చంపనేరక దేహమునే చంపువారికి భయపడకుడి గాని, ఆత్మను దేహమునుకూడ నరకములో నశింపజేయగలవానికి మిక్కిలి భయపడుడి" (28 వ.). పరిశుద్ధులారా, "మీరు ఆయనకు భయపడండి యికను మీరు ఎవరికిని భయపడనవసరము లేదు" అని ఒక వ్యక్తి అన్నాడు. తన మృతదేహాన్ని సమాధి చేస్తుండగా, జాన్ నాక్స్‌ను గూర్చి యిలా చెప్పబడింది: "ఏ మనిషి ముఖానికి భయపడనవసరములేనంతగా దేవునికి భయపడినవాడు యిక్కడ పండుకొని యున్నాడు"[15]

భయపడకు, ఎందుకంటె సర్వశక్తిగల దేవుడు నీ పక్షముననున్నాడు!

> "రెండు పిచ్చుకలు కాసుకు[16] అమ్మబడును గదా అయినను మీ తండ్రి సెలవు లేక వాటిలో ఒకటైనను నేలనుపడదు. మీ తలవెండ్రుకలన్నియు లెక్కింపబడియున్నవి గనుక మీరు భయపడకుడి; మీరనేకమైన పిచ్చుకలకంటె శ్రేష్ఠులు" (29–31 వచనాలు).

## ముగింపు

ప్రభువైన యేసు తన అపొస్తలుల ఎదుట ఉంచిన ప్రశ్నలు, ఆయన మన ఎదుట ఉంచినవి 39వ వచనంలో సంక్షిప్తం చేయబడ్డాయి: "తన ప్రాణము దక్కించుకొనువాడు దానిపోగొట్టుకొనును గాని నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొనువాడు దాని దక్కించుకొనును" అంటూ, తొలి హతసాక్షులు అగ్ని జ్వాలలకును, అడవి మృగములకును ఆహుతియయ్యారని పూర్వపు రచయితలు వ్రాశారు.

మత్తయి 10:39 కేవలము హతసాక్షులకే కాదు. అది మనలో ప్రతి ఒక్కరికిని చెందుతుంది. క్రొత్త నిబంధనలోని ప్రభువు మాటలలో తరచుగా ఈ భావన గోచరిస్తుంది. ఇది సువార్త రచనలో ఆరు సార్లు కన్పిస్తుంది (తక్కిన అయిదు సార్లు మత్తయి 16:25; మార్కు 8:35; లూకా 9:24; 17:33; యోహాను 12:25). తన పరిచర్యలో మన ప్రాణాలను కోల్పోయే ప్రాముఖ్యతను నేర్చుకోవలసిందిగా ప్రభువు మనలను కోరుతున్నాడు. "తన ప్రాణమును లెక్కించుకొనువాడు దాని పోగొట్టుకొనును; నా నిమిత్తము తన ప్రాణమును పోగొట్టుకొను వాడు దాని దక్కించుకొనును."

నీ పిలుపును, పనిని నీవు నిర్లక్ష్యం చేసినట్టయితే, స్వార్థపరంగా నీ జీవితాన్ని నీ కొరకే పట్టుకొని యున్నట్టయితే, నీవు దాన్ని పోగొట్టుకుంటావు. నీ జీవితంతో నీవు ఏమి చేయబోతావ్? నీ నిర్ణయపు (తీర్మానపు) దినము యిదే.[17]

---

సూచనలు

[1]నాలుగు సువార్త రచనలను, "క్రీస్తు జీవితం భాగం 1లో" చూడు. [2]అపొస్తలులను ఏర్పరచుకున్న విధానము – "క్రీస్తు జీవితం, భాగం 2లో" చూడు. [3]ఎఫెసీ. 6:20లో బంధకములలో ఉన్న "రాయబారి"నని పౌలు అంటాడు. ఆ కాలపు దౌత్యసంబంధమైన రాయబారులు ముసలి వారైయుంటారు. ఫిలోమోను 9లో "వృద్ధుడను" అనే పదం రాయబారిని అని తర్జుమా చేయాలంటారు. పౌలు రాయబారియై యుంటే, మిగిలిన అపొస్తలులందరు రాయబారులయ్యే ఉండాలి. అపొస్తలులు ప్రభువుకు ప్రతినిధులుగా నిలిచారు. తన్ను పంపినవానికి ప్రతినిధిగా ఉండడమే రాయబారి పని. [4]అపొస్తలులను గురించి సందేశం ముందు పాఠాల్లో యివ్వబడ్డాయి. [5]"క్రీస్తు జీవితం భాగం1లో" యితర తెగలతో జొలెతేవారు పేర్కొనబడ్డారు. [6]James Burton Coffman, *Commentary on Matthew* (Austin, Tex.: Firm Foundation Publishing House, 1968), 137. [7]యోహాను 13:20 చూడు. ప్రభువు క్రొత్త నిబంధనలో తెలిపినది, అపొస్తలులు చెప్పినది, వ్రాసినదానికంటె ఎక్కువ బలమైనదని కొందరు ఉపదేశిస్తారు. మత్తయి 10:42, యోహాను 13:20 అపొస్తలుల ఉపదేశము అది ఉన్నట్టుగానే, ప్రభువు యొక్క బోధయైయున్నట్టు తెలుపుతాయి. మనం అపొస్తలులను అంగీకరించితే, క్రీస్తును అంగీకరించినట్టే. మనం వారిని నిరాకరించితే క్రీస్తును నిరాకరించినట్టే. వారు ఆయన ప్రతినిధులు! [8]William Barclay, *The Gospel of Matthew*, vol. 1, rev. ed., The Daily Bible Study Series (Philadelphia: Westminister Press, 1975), 361. [9]Ibid., 392. [10]మన దేశపు ప్రతినిధులకు రహస్య గూడాచారులుంటారు. వారు ప్రతినిధులను, వారి కుటుంబాలను కాపలా కాస్తుంటారు.

[11]మత్తయి 10:37పై సంక్షిప్త చర్చకొరకు "మన రెండు కుటుంబాలు," అనే పాఠమును "క్రీస్తు జీవితం, భాగం 2లో" చూడు. [12]సమాజమువలన కలిగే శ్రమలకు దీనిని నేను వర్తింప చేస్తాను. [13]34నుండి 36వ వచనం వరకు సంక్షిప్త చర్చకొరకు "మన రెండు కుటుంబాలు" "క్రీస్తు జీవితం, భాగం 2లో" చూడు. [14]రోమా 8:14–17; ఫిలిప్పీ. 1:27–30; 1 పేతురు 2:18–21; 5:8, 9; 2 తిమోతి 3:10–12 చూడు. [15]Barclay, 386. [16]"కాసు" అని తర్జుమా చేయబడిన గ్రీకు పదం – రోమా నాణెములలో అల్పమైన దాని సూచిస్తుంది. ఇది దేనారంలో 1/15వ భాగమైయుంటుంది. [17]ఈ ప్రసంగమును ఉపయోగించినప్పుడు ప్రభువు యొద్దకు రమ్మని నీ శ్రోతలకు చెప్పుము (మార్కు 16:15, 16; అపొ. 2:37, 38). మరియు తప్పిపోయిన వారు ప్రభువు యొద్దకు తిరిగి ఎలా చేరవచ్చో తెలుపుము (అపొ. 8:22; యాకోబు 5:16).